నేడు పంచామృతాభిషేకం

మోతీనగర్: అవంతినగర్‌లోని శివరామాంజనేయ ఆలయంలో శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు సంకట హర చతుర్థి సందర్భంగా ఆలయంలో కొలువైన విజయ గణపతి స్వామికి ప్రత్యేక పూజలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు ధాన్యం, కందిపప్పులు, వారి గోత్రనామాలను పంపించవచ్చని తెలిపారు.

లీకేజీలకు మరమ్మతులు

సాక్షి కథనానికి స్పందించిన అధికారులు



పీజేఆర్ విగ్రహం వద్ద లీకవుతున్న వాల్వ్‌లకు మరమ్మతులు చేసిన సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: 'వాల్వ్ లీకేజీలు.. నీరు రోడ్డు పాలు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారుల స్పందించారు. గురువారం రిక్షాపుల్లర్ కాలనీలోని పీజేఆర్ విగ్రహం ముందు లీకేజీ అవుతున్న రెండు వాల్వ్‌లకు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కుత్బుల్లాపూర్: సొంతూరికి వెళ్లొచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేసిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన ఉదయ్ సాయిప్రసన్న, శ్యామల దంపతులు జీడిమెట్ల డివిజన్ సుచిత్ర బౌద్ధనగర్ సమీపంలోని విజయ హోమ్స్ విల్లా 10 లో ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీన ఊరికి వెళ్లారు. విల్లా పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశం ప్రహరీ నుంచి దూకిన దొంగలు ఇంట్లోకి చొరబడి సుమారు రూ. 20 లక్షల విలువ చేసే 21 తులాల బంగారు హారం, నాలుగు గాజులు, ఇతర బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీ చేశారు. వెండి వస్తువులను మాత్రం అక్కడే వదిలి వెళ్లారు. గురువారం ఊర్లెల్లి వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆరా తీయగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాసభల ఆహ్వానం అందజేత

నిజాంపేట్ : తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు గురువారం మేయర్ నీలాగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డిలను కలిశారు. రాష్ట్ర మున్సిపల్ యూనియన్ 4వ మహాసభలకు హాజరు కావాలని ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్, ప్రధాన కార్యదర్శులు యేసురత్నం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.







చిత్తారమ్మ జాతరకు పోదాం

నేటి నుంచి 25 వరకు ఉత్సవాలు

- 19న ప్రధాన జాతర.. భారీ ఏర్పాట్లు
- విద్యుత్ కాంతులతో ఆలయం

సుభాష్‌నగర్: నగరంలో ఉజ్జయిని మహంకాళి జాతర తర్వాత గాజులరామారంలో వెలసిన చిత్తారమ్మ దేవి జాతర పెద్ద జాతర. ఈ జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. 25 వరకు జరుగనున్న అమ్మవారి జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. జాతర స్వర్ణోత్సవాలు మహా ఘనంగా జరుగనున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు తెలిపారు. ఈ నెల 19న జరుగనున్న ప్రధాన జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా..

చిత్తారమ్మ దేవి ఆలయం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ అందుకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు చేసింది. నగరంలోనే కాకుండా ఇతర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో రానున్న సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలీస్ భద్రత, వైద్యం, మంచినీరు, పరిశుభ్రత, ట్రాఫిక్, విద్యుత్, మరుగుదొడ్లతోపాటు సికింద్రాబాద్ నుంచి అమ్మవారి ఆలయానికి ప్రతి అరగంటకు ఆర్టీసీ బస్సు సదుపాయాలను కల్పించారు.

జాతర విశేషాలు

జాతర శుక్రవారం నుంచి ప్రారంభమై 25వ తేదీ వరకు కొనసాగనుంది. 17న గణపతి పూజ, పుణ్యావచనం, పంచగవ్య ప్రాసన, అగ్ని ప్రతిష్ట, 18న గవ్యాంత పూజలు, మూల మంత్ర జపం, చండీ హోమం, గాజులరామారం గ్రామం నుంచి ఆలయం వరకు పూలగటం ఊరేగింపు, 19న



ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీడిమెట్ల, జగద్గిరిగుట్ట సీఐలు



ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

ప్రధాన జాతర ఉదయం 3 గంటలకు అభిషేకం, 4 గంటలకు విజయ దర్శనం, తలంబ్రాలతో ఒడి బియ్యం, అమ్మవారి పూజలు, బోనాలు, సాయంత్రం గాజులరామారం గ్రామం నుంచి పోతరాజుల విన్యాసాల మధ్య చిత్తారమ్మ దేవి ఊరేగింపు, 20న రంగం దివ్యవాణి, 21, 22, 23, 24లలో కుంకుమార్చన, 25న అన్నదానంతో జాతర ముగియనుంది.

విద్యుత్ కాంతులతో అలంకరణ

జాతర సందర్భంగా చిత్తరమ్మ దేవి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆలయానికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర మైకులు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో షాపులు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు.

టీ కన్సల్ట్‌తో సమగ్ర ఆరోగ్య సేవలకు ఆస్కారం

- వినూత్న ఆలోచనకు 100కు పైగా వైద్య నిపుణుల తోడ్పాటు
- టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాల వెల్లడి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సందీప్‌కుమార్ మక్తాల, సభ్యులు

రాయదుర్గం: టీ కన్సల్ట్‌తో సమగ్ర ఆరోగ్య సేవలు అందించటానికి ఆస్కారం లభిస్తుందని టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ కుమార్‌మక్తాల అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో టీకన్సల్ట్ సమగ్ర ఆరోగ్య కార్యక్రమాని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అలోపతి, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి వంటి వివిధ వైద్య పద్ధతులను సమన్వయంగా కలిపి సమగ్ర ఆరోగ్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నారు. ఇది మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ రోగులకు భారతీయ సంప్రదాయ వైద్య విధానాల గొప్పతనాన్ని పరిచయం చేయడానికి మంచి అవకాశమన్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను ప్రపంచానికి అందించడానికి ఇది ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. 63 దేశాలకు తమ కార్యకలాపాలను విస్తరించిన టీఐహెచ్ఎస్ ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలను పునర్నిర్వహించేందుకు సిద్ధమైందన్నారు. ఈ విశాల దృక్పథానికి మద్దతుగా ఇప్పటికే 100కు పైగా వైద్య నిపుణులు భాగస్వాములయ్యారన్నారు. టీఐహెచ్ఎస్ ద్వారా టీకన్సల్ట్ ఆధునిక వైద్యాన్ని భారతీయ సంప్రదాయ వైద్య పద్ధతులతో మిళితం చేస్తూ, రోగులకు సమగ్ర ఆరోగ్య అనుభవాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం సమగ్ర ఆరోగ్య సేవల రూపకల్పనలో భారతదేశాన్ని ఆధునిక సంప్రదాయ వైద్య పద్ధతుల నాయకుడిగా నిలిపేందుకు టీకన్సల్ట్ కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రణాళిక ద్వారా భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను ఆశించే 63 ఇతర దేశాల పౌరులతోపాటు ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న భారతీయ పౌరులకు వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, వైద్యనిపుణులకు అంతర్జాతీయ అవగాహనను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీకన్సల్ట్ బోర్డు డైరెక్టర్లు ఈశ్వర్ కోట, రాజీవ్ రావులపాటి, చల్లా నరేందర్, వంశీతిరున హరి పాల్గొన్నారు.

పథకాల అర్హుల గుర్తింపు సర్వే

- పీఏసీ చైర్మన్ గాంధీ



గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా వంటి పథకాల అమలుకు గురువారం గుర్తింపు సర్వే ప్రారంభమైందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 20వ తేదీ వరకు అధికారుల బృందం పర్యటించి అర్హులను గుర్తిస్తారని తెలిపారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలనలో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారని, దరఖాస్తు చేయని వారు స్పెషల్ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులకు రేషన్ కార్డులు అందుతాయని, దీనికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందన్నారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో సభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేస్తారని వివరించారు. రేషన్ కార్డులో సభ్యుల మార్పులు, చేర్పులు, తొలగింపునకు అవకాశం కల్పించారన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న బండి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు సురువు వెంకట్రావు, గంట విద్యాసాగర్, రంగా భాస్కర్ గౌడ్ కృష్ణ, ఏంబరి శ్రీకాంత్, శారద శ్రీనివాస్‌లను ఆలయ ప్రధాన అధ్యక్షులు గోపాల్ శర్మ అభినందించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద చేపడుతున్న వరద నీటి కాలువ పనులను గురువారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు, ప్రజల సహకారంతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు

వ్యవసాయేతర భూములను గుర్తించాలి



క్షేత్రస్థాయి పర్యటన వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కీసర: క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వ్యవసాయానికి యోగ్యమైన భూమియేనా?, కాదా? అని జాగ్రత్తగా గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కీసర తహసీల్దారును మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు ఆదేశించారు. గురువారం కీసర ఆర్డీఓ కార్యాలయంలో గ్రామాల సర్వే నెంబర్ల వారీగా వ్యవసాయేతర భూములను గుర్తించే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీఆర్ మ్యాప్‌ను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి భూములు వ్యవసాయ యోగ్యమైనవో, కావో కచ్చితంగా గుర్తించి సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. అవసరమైన చోట సర్వేయర్ల నుంచి సమాచారం సేకరించి లేఅవుట్లు, నివాసప్రాంతాలు, పరిశ్రమలకు సంబంధించిన భూముల వివరాలను కచ్చితంగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మ్యాప్‌తో చీర్యాల, గోధుమకుంట గ్రామాల సర్వే నెంబర్ల ద్వారా పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో లా-ఆఫీసర్ చంద్రావతి, కీసర తహసీల్దారు అశోక్ కుమార్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటామోవైరస్‌పై భయపడాల్సిన అవసరం లేదు

డాక్టర్ కిషన్ శ్రీకాంత్ స్పష్టీకరణ

రాయదుర్గం: మోటామోవైరస్ (హెచ్ఎంపీవీ) అనేది ఒక శ్వాసకోశ వైరస్ అని దీనిపై భయపడాల్సిన అవసరం లేదని నానక్‌రాం గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్ వెల్లడించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇది ఇటీవలి కాలంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నా రు. ఇది చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం, అవగాహన పెంచుకోవడం చాలా అవసరమన్నారు. ఈ శ్వాసకోశ వైరస్‌ను డచ్ పరిశోధకులు 2001లోనే తొలిసారిగా గుర్తించారని గుర్తు చేశారు. సాధారణ జలుబు, ఫ్లూ వంటి ఇతర శ్వాసకోశ వ్యాధుల మాదిరిగానే లక్షణాలు ఉంటాయ న్నారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి పట్ల అవగాహన ఏర్పాటు చేసుకొని ముందు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు చాలా తక్కువని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్క రూ తమ ఆరోగ్యం పట్ల తగిన ముందు జాగ్రత్తలు పాటించడమే కాకుండా వాకింగ్, యోగా, మెడిటేషన్ వంటివి చేయాల్సిన అవసరం కూడా ఉందని గుర్తు చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ఉస్మానియా వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ పరివర్తన విశేషమైన పరిణామం గురించి, అక్షరాస్యత అడ్డంకులను అధిగమించి సమాజంలోని అన్ని వర్గాలలో దాని పురోగతిని సాధించేలా ముందుకు సాగాలన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతికతతో ముఖ్యంగా కృత్రిమ మేధస్సుతో వ్యవహరించేటప్పుడు అపరిష్కృత సమస్యలపై దృష్టిపెట్టాలని విద్యావేత్తలు, విద్యార్థులకు ఆయన సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడమే కాకుండా ఆలోచించడం ప్రారంభించాలని కోరారు. 'మనూ'లో వివిధ రంగాలలో చేపట్టే కార్యక్రమాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'మనూ' ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. ఫజల్ రహమాన్ మాట్లాడుతూ విద్య, పరిశ్రమల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడంలో సాంకేతిక ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ కోర్సు ప్రారంభం

– 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'మనూ'లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ ప్రారంభించబోతున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రకటించారు. ఇది మల్టీ డిసిప్లినరీ విధానంతో కూడిన కోర్సును స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద నిర్వహించబడుతుందన్నారు. ఇంజినీరింగ్‌లో డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, సమాచార విభాగంలో అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా 'మనూ' ప్రొఫెసర్లు అబ్దుల్ వాహిద్, ప్రదీప్‌కుమార్, జమీల్ అహ్మద్, అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారి, గులామ్‌నబీ, బిస్వజిత్ బ్రహ్మచ ఎం.ఏ.హమీద్, సయ్యద్ ఇంతియాజ్ హసన్ ప్రసంగించారు.

తనిఖీలేవి?

- నిద్రమత్తులో ఫుడ్ సేఫ్టీ అధికారులు
- కల్తీ ఆహార పదార్థాలతో ప్రజలకు అనారోగ్యం
- చర్యలు తీసుకోవాలంటున్న వినియోగదారులు



కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో టిఫిన్‌లో వచ్చిన బొద్దింక



నిజాంపేట్ రోడ్డులో ఓ హోటల్‌లో బిర్యానిలో వచ్చిన బొద్దింక అవశేషాలు (ఫైల్)



వివేకానందనగర్ కాలనీలోని ఓ జ్యూస్ సెంటర్‌లో డ్రైఫ్రూట్స్ సలాడ్‌లో వచ్చిన పురుగు (ఫైల్)

ఆల్విన్‌కాలనీ: పలు వ్యాపార సంస్థల యజమానులు ధనార్జనే ధ్యేయంగా భావిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు, జ్యూస్ సెంటర్‌లు, ఐస్‌క్రీం పార్లర్లు, ఫైవ్ స్టార్ హోటల్స్‌లో సైతం విచ్చలవిడిగా, నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వ్యాపారులు ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, హోటళ్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. రోజుల తరబడి మరిగిపోయి నిల్వ చేసిన నూనెతో ఫ్రైడ్ రైస్, మంచూరియా తదితర పదార్థాలను తయారు చేస్తున్నారు. ఫైవ్‌స్టార్ హోటల్స్ మొదలుకొని రోడ్డు పక్కన తోపుడు బండ్లపై వ్యాపారం చేసే వారి వరకు కల్తీ పదార్థాలే విక్రయిస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. హోటళ్లు, హాస్టల్స్, వివిధ ఆహార పదార్థాలను వండే సెంటర్‌లలో కల్తీ నూనెతో ఆహార పదార్థాలను తయారు చేసి వాటిని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీ ఆహార పదార్థాల విషయంపై కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ హెల్త్ ఆఫీసర్‌ను వివరణ కోరగా.. తాను బయట ఉన్నానని, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పవన్‌కు ఫోన్ చేయమని చెప్పారు. ఆయనకు ఫోన్ చేయగా ఆ అధికారి స్పందించలేదు.

నామమాత్రపు తనిఖీలు

ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సంబంధిత హోటల్స్ యజమానులు ఇచ్చే ముడుపులకు అమ్ముడుపోయి నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అదే విధంగా టీస్టాళ్లలో నాణ్యత లేని నకిలీ టీ పొడులు, పాల ప్యాకెట్లు, పంచదారలను వినియోగించటం గ్లాసులను కూడా సరిగ్గా కడగకపోవటం వంటివి చేస్తున్నా అధికారులకు కనిపించడం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చికెన్, మటన్ తదితర మాంసాలను ఫ్రిజ్‌లో రోజుల తరబడి నిల్వ చేసి వడ్డిస్తున్నా అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఓ హోటల్‌లో కూడా గతంలో అధికారులు పరిశీలించి రెండు మార్లు పట్టుకున్నా ఆ హోటల్‌ను సీజ్ చేసి తిరిగి వదిలేశారు.

ఆరోగ్యం కోసం వస్తే అనారోగ్యం..



ఓ జ్యూస్ షాపులో జ్యూస్ తాగటానికి వెళ్లాను. నాతో పాటు వచ్చిన మరో వినియోగదారులు ఫ్రూట్ సలాడ్ ఆర్డర్ ఇవ్వగా.. అతను తీసుకున్న ఫ్రూట్ సలాడ్‌లో పురుగు వచ్చింది. దీంతో అతను యజమాని దృష్టికి తీసుకెళ్లగా.. అతను డ్రైఫ్రూట్స్‌లో ఎక్కడో పురుగు ఉండి ఉంటుందని సర్ది చెప్పటానికి ప్రయత్నించాడు. ఆరోగ్యం కోసం వస్తే అనారోగ్యం లభించేలా చేస్తున్నారు. కల్తీ ఫుడ్ బాగా పెరిగిపోయింది. అధికారులు తనిఖీలు నిర్వహించాలి.

– భాస్కర్ రెడ్డి, కూకట్‌పల్లి

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లోని ఓ జ్యూస్ సెంటర్‌లో డ్రై ఫ్రూట్ సలాడ్ కోసం వినియోగదారుడు ఆర్డర్ ఇచ్చాడు. అందులో పురుగు రావటంతో యజమానికి ఫిర్యాదు చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇంత చిన్న విషయానికి రాద్ధాంతం అవసరమా? అని సమాధానం చెప్పాడు.
- కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లోని ఓ హోటల్‌లో టిఫిన్ తినే సమయంలో బొద్దింకలు ఉన్న ఆహార పదార్థాన్ని అందించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానం చెబుతున్నాడని వినియోగదారుడు వాపోయాడు. ఇలాంటి టిఫిన్ సెంటర్‌లను వెంటనే సీజ్ చేయాలని వినియోగదారుడు హోటల్ ముందు నిరసన వ్యక్తం చేశాడు.
- కూకట్‌పల్లి – నిజాంపేట్ రోడ్డులోని ఓ పెద్ద హోటల్‌లో బిర్యాని ఆర్డర్ చేయగా.. బిర్యానిలో బొద్దింక అవశేషాలు వచ్చాయి. దీంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు.